# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-10-2023** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆసియా క్రీడల్లో భారత్ 25 స్వర్ణ పతకాలతో సహా వంద పతకాలు సాధించి చరిత్ర సృష్టించింది.**
2. **వస్తు, సేవల పన్ను-జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఢిల్లీలో జరుగుతోంది.**
3. **ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.**
4. **ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడంగా విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్‌ను ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ ఎంపిక చేసింది.**
5. **తిరుమలలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.**

=========================

ఆసియా క్రీడల్లో భారత్ వంద పతకాలను సాధించి చరిత్ర సృష్టించింది. ఈరోజు ఉదయం జరిగిన మహిళల కబడ్డీ ఫైనల్‌లో చైనీస్ జట్టుపై గెల్చి భారత్ స్వర్ణం సాధించింది. ఆర్చరీ ఈవెంట్‌లో మొత్తం 4 పతకాలను భారత్ కైవసం చేసుకుంది. ఆర్చరీ మహిళల విభాగంలో తెలుగమ్మాయి జ్యోతి సురేఖ స్వర్ణం సాధించింది. ఇదే అర్చరీ విభాగంలో అదితి గోపీచంద్ కాంస్యం సాధించింది. ఆర్చరీ పురుషుల విభాగంలో ఓజాస్ డియోటేల్ స్వర్ణం గెలుచుకోగా... అభిషేక్ రజతం సాధించాడు. దీంతో ఇప్పటివరకు భారత్ గెలుచుకున్న పతకాల సంఖ్య 100కి చేరింది. ఇందులో 25 స్వర్ణ, 35 రజతం, 40 కాంస్య పతకాలు ఉన్నాయి. ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్ 4 స్థానంలో కొనసాగుతోంది.

ఆసియా క్రీడల్లో భారత్ సరికొత్త రికార్డు సృష్టించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. చారిత్రాత్మక మైలురాయికి కారణమైన భారత క్రీడాకారులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాని... ఆసియా క్రీడల బృందానికి ఆతిథ్యం ఇవ్వడానికి, అథ్లెట్లతో సంభాషించడానికి ఎదురుచూస్తున్నట్టు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

-------------------------

వస్తు, సేవల పన్ను-జీఎస్టీకి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఈ రోజు ఢిల్లీలో జరుగుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 52వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరితో పాటు, ఆయా రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు, అధికారులు హాజరయ్యారు.

-------------------------

ఐదు రాష్ట్రాల్లో జరుగబోయే ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని కేంద్ర ఎన్నికల సంఘ ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల పరిశీలకులకు సూచించారు. మిజోరాం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల పరిశీలకులతో నిన్న ఢిల్లీలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ... ఎన్నికల ప్రక్రియలో పరిశీలకులు ముఖ్యమైన భాగమని, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. వికలాంగులు, 80 ఏళ్లు పైబడిన పౌరులు, ఇంటి నుండే ఓటు వేయడానికి.. పోలింగ్ బూత్‌కు చేరుకోవడానికి సౌకర్యాలను కల్పించడంపై ఎన్నికల సంఘం నిరంతరం దృష్టి సారిస్తోందని తెలిపారు.

---------------------------

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విజయనగరం జిల్లా గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన పరిశీలించి... వైద్యపరీక్షల నిర్వహణ తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని అన్నారు. ఇంటి ముందుకే వైద్యం అందించడం ఇదే ప్రథమమని... జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

---------------------------

ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడంగా విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్‌ను ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్-ఐసీఐడీ ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌కు ఐసీఐడీ డైరెక్టర్ అవంతివర్మ తాజాగా లేఖ రాశారు. నవంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో జరిగే ఐసీఐడీ 25వ కాంగ్రెస్‌లో ప్రకాశం బ్యారేజ్‌కి ఇచ్చే అవార్డును రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు అందుకోనున్నారు. ప్రకాశం బ్యారేజ్‌తో కలిపి రాష్ట్రంలో ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా ఐసీఐడీ గుర్తించిన ప్రాజెక్టుల సంఖ్య ఐదుకు చేరుకుంది. కుర్నూలు-కడప కెనాల్, కంభం చెరువు, పోరుమామిళ్ల చెరువులను 2020లో.. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌ను 2022లో ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా ఐసీఐడీ ఇప్పటికే ఎంపిక చేసింది. పురాతన కాలంలో నిర్మించి.. ఇప్పటికీ ఆయకట్టుకు నీళ్లందిస్తున్న సాగునీటి కట్టడాలను ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా ఐసీఐడీ ఎంపిక చేసి అవార్డులను ప్రదానం చేస్తోంది.

---------------------------

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వేదగిరిలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రసాద్ పథకం కింద ఎంపిక చేసింది. దీంతో ఆలయ అభివృద్ధికి 53 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ మేరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి జిల్లా అధికారులకు సమాచారం అందించారు. జిల్లాలోని ఇతర ప్రాచీన ఆలయాలను కూడా ఈ పథకం కింద తీసుకువచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రసాద్ పథకం కింద శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఎంపిక కావడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

---------------------------

అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఈ నెల 14న అంకురార్పణ జరుగుతుందని తెలిపారు. బ్రహ్మోత్సవాల తేదీల్లో అన్ని రకాల ప్రత్యేక దర్శనాలను రద్దు చేశామన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబరు 23వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ వరకు దర్శనానికి వీలుగా 2 లక్షల టికెట్లను త్వరలోనే ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నామని తెలిపారు. తిరుమలలో

యూపీఐ విధానంలో చెల్లింపులు చేసి గదులు పొందిన భక్తులకు వారు గదులు ఖాళీ చేసిన గంటలోపు కాషన్ డిపాజిట్ మొత్తం రీఫండ్ చేస్తున్నట్లు వివరించారు.

---------------------------

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయడానికి విదేశీ ప్రతినిధుల బృందం ఈ రోజు, రేపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మానాయక్ తెలిపారు. ఈ బృందంలో ఆఫ్రికా దేశాలైన సెనెగల్, టునీషియా, బెనిన్, మడగాస్కర్, జాంబియా, మలవాయి తదితర దేశాల నుంచి 27 మంది ప్రతినిధులు ఉంటారని అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు టి.విజయకుమార్ ఆధ్వర్యంలో విదేశీ బృందం ఈ రోజు శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం యగ్నశెట్టిపల్లి, అనంతపురంలలో ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలిస్తుందని తెలిపారు.

---------------------------

ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దనున్నట్లు ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ తెలిపారు. స్టేడియం అభివృద్ధిపై కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో చర్చించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ...రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మించిన ఏకైక అథ్లెటిక్ కేంద్రం అల్లూరి సీతారామరాజు స్టేడియం అని... ఇక్కడ శిక్షణ తీసుకున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. స్టేడియాన్ని 9 కోట్ల 50 లక్షల రూపాయలతో తీర్చిదిద్ది, 8 లైన్ల ట్రాక్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 50 శాతం వరకు నిధులు సమకూరుస్తుందని వివరించారు.

---------------------------

బాల్య వివాహాల నివారణకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాల నివారణ, కార్యాచరణ ప్రణాళిక అంశంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. బాల్య వివాహాలపై. క్షేత్రస్థాయిలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ మేరకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇళ్లవద్ద ఉండే బాలికలకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పనపై దృష్టిసారించాలని కోరారు. ఈనెల 16న అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

వాయిస్ – 30 సెకన్లు

---------------------------

2023 సంవత్సరానికి గానూ ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి ఇరాన్‌కు చెందిన మహిళా సామాజిక కార్యకర్త నర్గేస్ మొహమ్మదికి లభించింది. నర్గేస్ మొహమ్మది.. ఇరాన్‌లో మహిళలపై అణచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. మహిళల హక్కులు, స్వేచ్ఛపై పోరాటం చేసినందుకుగాను ఆమెను శాంతి బహుమతికి ఎంపిక చేసినట్లు నోబెల్ కమిటీ తెలిపింది.

====================